# జీతముల స్వచ్ఛంద అర్పణ (పన్ను విధింపునుండి మినహాయింపు) చట్టము, 1961
## (1961 లోని 46వ చట్టము)

( 6వ డిసెంబరు, 1961 )

తనకు చెల్లింపదగు జీతములోని లేక బత్తెములలోని కొంత భాగమును ప్రజాహితము దృష్ట్యా స్వచ్ఛందముగా వదలుకొను ఎవరేని వ్యక్తి యొక్క రాబడిలోని ఆ భాగమును, రాబడి పన్నుల నుండి మినహాయించుట కొరకు నిబంధనలు చేయుటకైన చట్టము.

భారత గణరాజ్యము యొక్క పన్నెండవ సంవత్సరములో పార్లమెంటుచే ఈ క్రింది విధముగా శాసనము చేయబడినది :—

**సంగ్రహనామము.**

1. ఈ చట్టమును జీతముల స్వచ్ఛంద అర్పణ (పన్ను విధింపు నుండి మినహాయింపు) చట్టము, 1961 అని పేర్కొనవచ్చును.

**ప్రభుత్వమునకు అర్పింపబడిన జీతముల విషయమున రాబడి పన్నుల నుండి మినహాయింపు.**

2. భారత రాబడి పన్ను చట్టము 1922, (1922లోని 11వ చట్టము) లోగాని, రాబడిపై పన్ను విధింపునకు సంబంధించి తత్సమయమున అమలు నందున్న ఏదేని ఇతర శాసనములోగాని, ఏమియున్నప్పటికిని ఏ వ్యక్తియైనను—

(ఏ) అతనికి జీతము భారత సంచితనిధి నుండి గాని, రాజ్య సంచితనిధి నుండి గాని చెల్లించవలసి యున్నయెడల, 1961 మార్చి 31వ దినమునకు తరువాత ఏ కాలావధికైనను అతనికి చెల్లింపదగు జీతము నుండి, ప్రజాహితము దృష్ట్యా వ్రాతమూలకమైన ప్రఖ్యానము ద్వారా అతడు స్వచ్ఛందముగ ఎంత భాగమును వదలుకొనునో, ఆ భాగము విషయమున,

(బీ) ఇతర ఏ సందర్భములోనైనను, 1961 మార్చి 31వ దినమునకు తరువాత ఏ కాలావధికైనను అతనికి చెల్లింపదగు జీతము నుండి, కేంద్ర ప్రభుత్వముచే ఈ విషయమున చేయబడిన నియమముల ననుసరించి ప్రజాహితము దృష్ట్యా ఆ ప్రభుత్వమునకు ఎంత భాగము అర్పింపబడి చెల్లింపబడునో, ఆ భాగము విషయమున,

ఎట్టి రాబడి పన్నుగాని సూపర్ పన్నుగాని చెల్లింపవలసి యుండరాదు;

మరియు రాబడిపై పన్ను విధించుటకు సంబంధించిన ఏదేని శాసనము నిమిత్తము అతని మొత్తము రాబడిలో జీతములోని అట్టి భాగమును చేర్చరాదు.

**2వ పరిచ్ఛేదము యొక్క నిబంధనలు బత్తెములకు వర్తించుట.**

3. 2వ పరిచ్ఛేదము యొక్క నిబంధనలు, అందు నిర్దేశింపబడిన ఎవరేని అట్టి వ్యక్తికి 1961 మార్చి 31వ దినము తరువాత ఏ కాలావధికైనను అతని జీతమునకు సంబంధించి వర్తించునట్లే అతనికి చెల్లించదగు ఏవైన బత్తెములకు సంబంధించి వర్తించవలెను.

**నియమములు చేయు అధికారము.**

4. (1) కేంద్ర ప్రభుత్వము, ఈ చట్టపు ప్రయోజనములను నెరవేర్చుటకు రాజపత్రములో అధిసూచన ద్వారా నియమములను చేయవచ్చును.

(2) ఈ పరిచ్ఛేదము క్రింద చేసిన ప్రతి నియమమును అది చేయబడిన పిమ్మట వీలైనంత త్వరితముగా పార్లమెంటు అధివేశనములోనున్న సమయమున, మొత్తము ముప్పది దినముల కాలావధిపాటు దాని ప్రతి యొక సదనము సమక్షమున ఉంచవలెను. ఆ ముప్పది దినములు ఒకే అధివేశనములోగాని లేక వెనువెంటనే వచ్చు రెండు అధివేశనములలో గాని చేరియుండవచ్చును; అది అట్లు పుంచబడిన అధివేశనముగాని దాని అవ్యవహితానంతర అధివేశనము గాని ముగియుటకు పూర్వమే ఆ నియమములో ఏదేని మార్పు చేయుటకు ఉభయ సదనములు అంగీకరించినచో లేక ఆ నియమము చేయబడరాదని ఉభయ సదనములు అంగీకరించినచో అటు పిమ్మట ఆ నియమము అట్లు మార్పు చేయబడిన రూపములో ప్రభావము కలిగియుండును లేక, సందర్భానుసారముగ, ప్రభావ రహితమై యుండును; అయినప్పటికిని ఏదేని అట్టి మార్పుగాని, రద్దుగాని అంతకు పూర్వము ఆ నియమము క్రింద చేయబడిన దేని యొక్క శాసన మాన్యతకైనను భంగము కలిగించదు.

**రద్దు.**

5. (1) జీతముల స్వచ్ఛంద అర్పణ (పన్ను విధింపు నుండి మినహాయింపు) చట్టము, 1950 (1950 లోని 61వ చట్టము) ను ఇందుమూలముగా రద్దు చేయడమైనది.

(2) అట్లు రద్దు చేయబడినప్పటికిని, సదరు చట్టము క్రింద చేయబడిన ప్రఖ్యానమును దేనినైనను, ఈ చట్టము యొక్క ప్రయోజనముల కొరకై చేయబడిన ప్రఖ్యానముగా భావించవలెను.